స్కెచ్ :

# "నాలో నేను"

"బావ వస్తున్నాడనేంటి .... అమ్మగారి ముస్తాబంతా...." అని మాచెల్లి అనగానే తిరిగిచూశా, అప్పుడే యేమూలకో జారింది....కనబడితే దానిపని పట్టించి వుందును—ఆరేళ్ళు నిండాయో లేదో అప్పుడే పెద్ద కబుర్లు.

ఈ రోజు మెయిల్లో మాబావ బొంబాయి నుండి చదువు పూర్తిచేసుకుని వస్తున్నాడు. ఎనిమిది సంవత్సరాల క్రిందట చూశాను బావని .... యిప్పుడో? అద్దంలో చూసుకుని పౌడరద్దుకుంటున్నా. వెనకాలెవరో నవ్వినట్లనిపించింది. తిరిగిచూస్తే, యెవరూ లేరే! చీరలన్నీ తీసిచూశా, యేదికట్టుకోడమో అర్థంకాలే....పోనీ అమ్మనడుగుతే! పచ్చ జార్జెట్టుచీర కట్టుకుని అద్దంలో చూసుకున్నా—చాలా బాగుంది.

గడియారం పదిగంటలు కొట్టింది. నా హృదయమెందుకో వేగంగా కొట్టుకుంటూంది. ఈపాటికి బావ రైలు దిగుతాడు. మేడమీద నిలబడి వచ్చే, పోయే కార్లను వెర్రిగా చూస్తున్నా. బావ వచ్చి, నన్నేమని పలుకరిస్తాడో? అప్పుడు నేను....యేవో ఊహలు....

గుమ్మంలో కారు ఆగింది. కళ్ళు తుడుచుకుని చూశా, నల్లగా....మ్యునిసిపాలిటీ రోలరులాగ, హేండ్‌బేగ్ పట్టుకుని దిగాడు బావ. మా నాన్నగారు యెదురుగా వెళ్ళి యింట్లోకి తీసుకెళ్ళారు.

ఛీ! బావ యెనిమిది సంవత్సరాలలో యెలా మారిపోయాడు. "మాబావ అందంగా .... వుంటాడని ...." యేవేవో సరోజతో చెప్పాను కదా! సరోజ వచ్చి "ఈ అందాలరాజేనా మీ బావ...."అంటే యేమని సమాధానము చెప్పడం?— ఆ మ్యునిసిపాలిటీ రోలరువచ్చి.... "ఏం? లతా?...." అని యేవేవో అంటాడు. అద్దంలో చూసుకున్నా, నా మొహంలా కనబడలేదు. మంచంమీద పడుకున్నా - ప్రక్కన ఆ నల్లగా ... రోలరువున్నట్లనిపించింది. లేచి కూర్చున్నా—

ఎన్ని సంబంధాలు వచ్చినా మానాన్న "లతను మా చెల్లెలు కొడుకు రావుకిచ్చి వివాహం చెయ్యడం నా సంకల్పం...." అంటూ త్రోసి పుచ్చారు. "ఛీ! బావను నేను పెండ్లి చేసుకోను! ...." అని ఢంకామీద కొట్టి చెప్పేస్తా—మొన్న సుగుణకు బలవంతంగా ముసలాడికిచ్చి పెండ్లి చేసినట్లు—మానాన్న కూడనన్న........ యేమైనాసరే! నేను రోలరు బావను పెండ్లాడను—అది నా స్థిర నిశ్చయం.

"అత్తా! లత కనబడదేం! ...." అది రోలరు బావ గొంతుకే. "మేడమీద గదిలో వుందనుకుంటా...." అని మా అమ్మ నవ్వుతూ సమాధానం. అసలుదానికి నవ్వెందుకు వస్తోందో నాకర్థం కాలేదు. మేడ మెట్లు చప్పుడవుతున్నాయి. అద్దంలోకి చూస్తూ, సినీతార ఫోజులో కూర్చున్నా....

"లతా! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావేం?".... అద్దంలో ప్రతిబింబంచూశా .... ఆశ్చర్యం!! తెల్లగా.... ఉంగరాలజుత్తు— వెనక్కు తిరిగిచూశా.... యెంత అందంగా వున్నాడు బావ. నాకు పారిపోవాలనిపించింది; కాని బావ చెయ్యిపట్టుకుని....గట్టిగా....

నా కదోలా అనిపించింది. మగాళ్ళకు సిగ్గుండదని చెప్పిన సరోజ మాటలు నిజమే ... "లతా! నువ్వెంత అందంగా వున్నావు...." అని బావ....

"బావా! మానాన్నగారు నిన్నెందుకో పిలుస్తున్నారు?" అని మాచిన్న తమ్ముడు రామం మాయిద్దరినీ చూస్తూ, వెర్రి మొహం వేశాడు. వెధవకి పనీపాటులేదు. అక్కడి కబుర్లిక్కడ, యిక్కడి వక్కడ....

బావ మేడ దిగాడు. నేనూదిగి చూద్దును కదా! నల్లగా, మ్యునిసిపాలిటీ రోలరు లాగున్న వ్యక్తిని సావడిలో చూడగానే, భయమేసింది.

మా నాన్నగారు బావకి.... "ఈయన ఇన్సూరెన్సు కంపినీ మేనేజరు....భీమారావుగారు...." అని పరిచయం చేస్తున్నారు.

★

శ్రీ ధవళ నాగేశ్వర్